సాక్షి
కుమురం భీం

శనివారం : 6 : ఏప్రిల్ : 2024



న్యూస్‌రీల్

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా విజయ్‌కుమార్


విజయ్‌కుమార్

ఆసిఫాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని భారతీయ జనతా పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వాంకిడి మండలం ఇందానికి చెందిన కొట్నాక విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం నియామక పత్రం అందించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినందుకు పార్టీ అధిష్టానికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం పని చేస్తానన్నారు.

శాంతిభద్రతల రక్షణకు సహకరించాలి


కవాతు చేస్తున్న పోలీసులు

చింతలమానెపల్లి(సిర్పూర్): ప్రజలు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, శాంతిభద్రతల రక్షణకు సహకరించాలని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని బాబాపూర్, రవీంద్రనగర్ 1లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. రవీంద్రనగర్‌లో మాట్లాడారు. రహదారి ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. బైక్‌లపై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎస్సై నరేశ్, సిబ్బంది ఉన్నా రు.

బాల్యవివాహాలు నేరం



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేశ్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఇటీవల మైనర్లకు వివాహం జరిపించిన తల్లిదండ్రులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాల రక్షా భవన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లి వయస్సు వచ్చే వరకు ఎవరి ఇంటి వద్ద వారు ఉండాలన్నారు. మైనారిటీ తీరకుండానే పెళ్లి చేస్తే నేరమవుతుందని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహం చేస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా ఈఆర్ఎస్ఎస్ 112 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరిపించాలని సూచించారు. కార్యక్రమంలో బాల రక్షా భవన్ సిబ్బంది ప్రవీణ్, వెంకటేశ్వర్లు, సఖి కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్ల సస్పెన్షన్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రైవర్లు విధుల్లో చేరే ముందు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తారు. మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో డ్రైవర్లు కేఎస్.నారాయణ, పీఎస్ గౌడ్‌లను సస్పెండ్ చేసినట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ శుక్రవారం వెల్లడించారు. దాదాపు 18రోజుల తర్వాత డ్రైవర్లపై చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, మద్యం తాగకున్నా తాగినట్లుగా బ్రీత్ ఎనలైజర్ పరికరంలో నమోదవుతున్నట్లు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. మంచిర్యాల డిపోలో విధులకు హాజరైన ఓ డ్రైవర్‌కు పరీక్ష చేయగా మద్యం తాగినట్లు రావడంతో విధులకు నిరాకరించారు. పోలీసు శాఖ చేపట్టిన పరీక్షలో తాగలేదని ధ్రువీకరించగా.. ఆర్టీసీ బ్రీత్‌ఎనలైజర్‌తో ఓసారి ఫుల్(తాగినట్లు), మరోసారి నిల్(మద్యం తాగనట్లు) రావడం చర్చనీయాంశంగా మారింది. గత నెల 16న కేఎస్.నారాయణకు ఆర్టీసీ నిర్వహించిన పరీక్షలో 20శాతం మేర మద్యం సేవించినట్లు రాగా పోలీసుస్టేషన్‌లో అప్పటికప్పుడు నిర్వహించిన పరీక్షలో సున్నాగా వచ్చింది. మరో డ్రైవర్‌కు 12శాతం వచ్చినట్లు చెబుతున్నారు. పరికరాల్లో సాంకేతిక లోపాలను సరిచేయక పోవడం శాపంగా మారుతోంది. పరికరంలో లోపాలు లేకుంటే మరుసటి రోజు ఎందుకు మరమ్మతులకు పంపిస్తారని ప్రశ్నిస్తున్నారు.

తప్పిన గజరాజు గండం


మురళీగూడ రహదారి వద్ద ఏనుగు

- ఎట్టకేలకు ప్రాణహిత నది దాటిన ఏనుగు
- పెంచికల్‌పేట్ మండలంలో 36 గంటలపాటు సాగిన సెర్చ్ ఆపరేషన్
- డ్రోన్‌ల సహాయంతో ప్రత్యేక బృందాల గాలింపు
- ఫలించిన అటవీశాఖ అధికారుల కృషి
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు

పెంచికల్‌పేట్(సిర్పూర్): గజరాజు గండం ముగిసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన ఏనుగు ఎట్టకేలకు ప్రాణహిత నది దాటింది. శుక్రవారం నుంచి పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం, జిల్లెడ, మురళీగూడ గ్రామ సమీపంలో ఏనుగును గుర్తించి అటవీశాఖ అధికారులు, ప్రత్యేక బృందాలు, పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించారు. ఫలితంగా ఏనుగు రాత్రి 7.30 గంటల ప్రాంతంలో మురళీగూడ వద్ద ప్రాణహిత నది దాటి మహారాష్ట్ర అడవుల్లోకి ప్రవేశించింది. పెంచికల్‌పేట్ మండలంలో 36 గంటలపాటు కొనసాగిన గజరాజు సెర్చ్ ఆపరేషన్ ముగియడంతో అంతా ఊపరి పీల్చుకున్నారు.

బూరెపల్లి టు మురళీగూడ

ఈ నెల 3న మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నది దాటి వచ్చిన ఏనుగు బూరెపల్లి గ్రామ శివారులో పంట చేనులో అల్లూరి శంకర్‌పై ఒక్కసారిగా దాడి చేసి హతమార్చింది. అక్కడి నుంచి ఖర్జెల్లి, రుద్రాపూర్, సులుగుపల్లి గ్రామాల మీదుగా పెంచికల్‌పేట్ మండలంలోకి ప్రవేశించింది. ఈ నెల 4న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామ సమీపంలోకి వచ్చింది. అక్కడ తెల్లవారుజామున వరి పొలానికి నీటిని అందించేందుకు వెళ్తున్న కారు పోశన్నను తొక్కి చంపింది. ఇద్దరు రైతులు ఏనుగు దాడిలో మృత్యువాత పడటంతో అటవీశాఖ అధికారులు చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కౌటాల మండలాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. 144 సెక్షన్ విధించి ప్రజలను అప్రమత్తం చేశారు.

కమ్మర్‌గాంలో ప్రత్యక్షం

లోడుపల్లి వద్ద సంచరించిన ఏనుగు శుక్రవారం ఉదయం కమ్మర్‌గాం గ్రామ సమీపంలోని పల్లె ప్రకృతి వనం వద్ద ప్రత్యక్షమైంది. దానిని చూసిన గ్రామస్తులు హడలిపోయి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. లోడుపల్లి, మెరెగూడ నుంచి అటవీప్రాంతం నుంచి గుండెపల్లి మీదుగా కమ్మర్‌గాం చేరుకున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ప్రత్యేక బృందాలు డ్రోన్‌ల సహాయంలో మురళీగూడ మునలమ్మ గుట్టపై తిరుగుతున్నట్లు గుర్తించారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మురళీగూడ నుంచి కమ్మర్‌గాం వస్తున్న ఆటోకు ఎదురురావడంతో అందులోని ప్రయాణికులు, డ్రైవర్ ఆటో వదిలేసి పారిపోయారు. ప్రత్యక్ష సాక్షుల సహాయంతో అధికారులు ఏనుగు పాదాల గుర్తులను పరిశీలిస్తూ జిల్లెడ గ్రామ సమీపంలోకి చేరుకున్నారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో మురళీగూడ సమీపంలోని పాలకుంట వద్ద ఏనుగును అధికారులు గుర్తించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతోపాటు స్థానిక అటవీశాఖ అధికారులు, పోలీసులు సమన్వయంతో ఏనుగును సురక్షితంగా ప్రాణహిత నదిని దాటించటానికి ప్రణాళికలు రూపొందించారు. దానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ సుమారు 14 గంటల పాటు కమ్మర్‌గాం నుంచి మురళీగూడ వరకు ఈ ఏనుగు అనుసరించారు. రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో మురళీగూడ వద్ద ప్రాణహిత నది దాటి మహారాష్ట్రలోని చిన్నవట్ర అటవీ ప్రాంతంలోకి ఏనుగు వెళ్లిపోవడంతో అధికారులు ఊపరి పీల్చుకున్నారు.

ఏనుగును గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డ్రోన్‌ల సహాయంలో గాలింపు ముమ్మరం చేశారు. కొండపల్లిలో రైతును హతమార్చిన అనంతరం ప్రత్యేక బృందాలు డ్రోన్‌ల సహాయంతో గాలించినా గురువారం ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. మళ్లీ రాత్రి ఎనిమిది గంటల తర్వాత లోడుపల్లి– పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై కొండపల్లి టర్నింగ్ వద్ద ఆర్టీసీ బస్సుకు ఎదురైంది. రాత్రిపూట గజరాజు కదలికలను గుర్తించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

గ్రామాల్లో భయం భయం

ఏనుగు సంచారంతో మూడు రోజులపాటు చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం మండలాల ప్రజలు భయం భయంగా గడిపారు. పంట చేలు, రోడ్లపై తిరుగుతుండటంతో గిరిజన గ్రామాల్లో బయటికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి ఏనుగు నది తీరం దాటిపోయిందని అధికారులు నిర్ధారించడంతో సరిహద్దులోని గిరిజన గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


డ్రోన్‌ల ద్వారా గాలిస్తున్న ప్రత్యేక బృందాలు


డ్రోన్ సిద్ధం చేసుకుంటున్న దృశ్యం

ఇద్దరి ప్రాణాలు పోయాయి



వన్యప్రాణుల దాడులతో భయం భయంగా గడుపుతున్నాం. ఇప్పటికే కొండపల్లి గ్రామంలో పెద్దపులి, ఏనుగు దాడుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. వన్యప్రాణుల దాడుల సమయంలో హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రజల ప్రాణాలు పోతున్నాయి. ఇకనైనా ప్రజల రక్షణకు చర్యలు చేపట్టాలి.

– మెంగబోయిన పోశన్న, కొండపల్లి, మం.పెంచికల్‌పేట్

బైక్ వదిలేసి పరిగెత్తాం



గురువారం రాత్రి సలుగుపల్లి నుంచి పెంచికల్‌పేట్ వస్తుండగా లోడుపల్లి అటవీ ప్రాంతంలో ఏనుగు ఎదురైంది. భయంతో బైక్ వదిలేసి వెనక్కి పరిగెత్తాం. ఆర్టీసీ బస్సు ఎదురుకావడంతో ఏనుగు వెళ్లిపోయింది. ప్రయాణికుల సాయంతో బైక్ తీసుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పెంచికల్‌పేట్ చేరుకున్నాం.

– దోశ రవి, పెంచికల్‌పేట్

రూ.50లక్షల పరిహారం చెల్లించాలి



అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి. గతంలో పెద్దపులి దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు కేవలం రూ.5 లక్షలు చెల్లించి చేతులు దులుపుకున్నారు. బాధిత కుటుంబాల్లో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి.

– కోట సతీశ్, మురళీగూడ మం.పెంచికల్‌పేట్

మహనీయుల జీవితం ఆదర్శప్రాయం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శప్రాయమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఎస్పీ సురేశ్ కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, డీఆర్‌వో లోకేశ్వర్, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహా వ్యక్తి అని కొనియాడారు. వివిధ శాఖలకు కేంద్ర మంత్రి విశిష్ట సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, డీటీడీవో రమాదేవి, డీఎంహెచ్‌వో తుకారాం, డీఎస్పీ సదయ్య, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్
- కెరమెరి, సిర్పూర్(యూ) పోలీస్‌స్టేషన్లు తనిఖీ


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కెరమెరి(ఆసిఫాబాద్): పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. కెరమెరి, సిర్పూర్(యూ) పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది విధులపై ఆరా తీసి, కేసులకు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలు ఓపిగ్గా వినాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి డిపార్ట్‌మెంట్‌లో పేరు దక్కుతుందన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎన్నికల నియామళి అమలులో ఉన్నందున కోడ్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ సదయ్య, సీఐలు శ్రీనివాస్, అంజన్న, ఎస్సైలు విజయ్, సాగర్ తదితరులు ఉన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

- డీఎస్పీ సదయ్య


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సదయ్య

ఆసిఫాబాద్‌అర్బన్: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ సదయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం సబ్ డివిజనల్‌లోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తుల ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని సూచించారు. తొందరపాటులో నేరాలు చేస్తే వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతులతో విచారణ చేపడతామని, నేరస్తులు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడి మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదేళ్లుగా ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీ షీట్ తొలగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సతీష్, వాంకిడి సీఐ శ్రీనివాస్, రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, పట్టణ ఎస్సై ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర పతనం.. సంతల్లో విక్రయం

- పడిపోయిన మిర్చి రేటు
- క్వింటాకు గరిష్టంగా రూ.17వేలు కూడా దాటని వైనం
- రూ.10వేలకే అమ్ముకుంటున్న అన్నదాతలు
- నాగ్‌పూర్ మార్కెట్‌కు వెళ్లలేక స్థానికంగానే విక్రయాలు


కౌటాల మండలం తాటిపల్లిలో ఆరబోసిన మిరప

కౌటాల(సిర్పూర్): లాభాలు తెచ్చిపెడుతుందని సాగు చేసిన మిరప పంట రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. వాతావరణ మార్పులు, తెగుళ్లతో ఇప్పటికే దిగుబడి తగ్గి ఆందోళన చెందుతున్న అన్నదాతలను మార్కెట్‌లో ధర మరింత కుంగదీస్తోంది. వచ్చిన కొద్దిపాటి పంటను మార్కెట్లకు తరలించి మరింత నష్టపోకుండా.. స్థానిక వార సంతలు, ఇళ్ల వద్దే కిలోల చొప్పున అమ్ముకుంటున్నారు.

తెగుళ్ల అధికం.. దిగుబడి కష్టం

జిల్లావ్యాప్తంగా ఈ సారి రెండు వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. కౌటాల మండలంలో 1073 ఎకరాలు, సిర్పూర్(టి)లో 236, బెజ్జూర్‌లో 135, చింతలమానెపల్లిలో 65, దహెగాంలో 190 ఎకరాలు, పెంచికల్‌పేట్‌లో 90 ఎకరాల్లో ఈ పంట సాగైంది. మిగిలిన పంటలతో పోల్చితే మిర్చి సాగులో రిస్క్ అధికంగా ఉంటుంది. మొక్కలకు తెగుళ్లు సోకే అవకాశం ఎక్కువగా ఉండటంతో దిగుబడి తక్కువగా వస్తుంది. అయితే ఇంతా శ్రమకు ఓర్చి పండించినా రైతులకు స్థానికంగా మార్కెట్ లేకపోవడం మరింత ఇబ్బందిగా మారింది. జిల్లా రైతులు ఎక్కువగా నాగ్‌పూర్, వరంగల్ మార్కెట్లకు పంట తరలిస్తుంటారు. స్థానికంగా మార్కెట్ లేని కారణంగా దళారులు అతితక్కువ ధరకు కొనుగోలు చేస్తూ అన్నదాతలను నిలువునా ముంచుతున్నారు. ధైర్యం చేసి మార్కెట్ వెళ్దామని ఆలోచించినా.. అక్కడ కూడా ధర పతనమవుతుండటంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

పతనమైన ధర..

జిల్లాలో గతేడాది మిర్చి సాగు చేసిన రైతులకు ఊహించని రీతిలో లాభాలు వచ్చాయి. క్వింటాకు రూ.25వేల వరకు పలికింది. దీంతో స్థానికంగా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అయితే ఈ సారి ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టినా దిగుబడి 8 క్వింటాళ్లు మించలేదు. ధర కూడా ఈ సీజన్ మొత్తంలో గరిష్టంగా రూ.17వేలు దాటలేదు. ప్రస్తుతం క్వింటాకు నాణ్యతను బట్టి రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు పలుకుతోంది. ఈ ధరకు మార్కెట్లతో విక్రయానికి తీసుకెళ్తే రవాణా ఖర్చులతో కలుపుకుంటే గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానికంగా వారసంతల్లో నేరుగా రైతులే విక్రయిస్తున్నారు. కొంతమంది మాత్రం ఇళ్లవద్దే మహిళలకు కిలోకు రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు.

ధర తగ్గుతోంది



రెండెకరాల్లో మిర్చి పంట సాగు చేశా. తెగుళ్ల కారణంగా పురుగు మందుల వినియోగం పెరిగి పెట్టుబడి రెట్టింపయ్యింది. ప్రస్తుతం మిరప ధర తీవ్రంగా తగ్గుతోంది. ఏం చేయాలో తోచడం లేదు. ఎండలకు చివరి కాయలు కూడా అంతంత మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

– రౌతు ప్రకాశ్, పార్డీ, కౌటాల

రూ.10వేలకు అమ్ముకున్న



తాటిపల్లిలో మూడెకరాల్లో మిర్చి పంట సాగు చేశా. ఇటీవల నాగ్‌పూర్ మార్కెట్‌కు 20 క్వింటాళ్ల పంటను తీసుకెళ్తే.. అక్కడ ధర లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో రూ.10,500కు విక్రయించా. మద్దతు ధర రూ.20 వేలు ఉంటే తప్ప రైతులకు గిట్టుబాటు కాదు.

– బోయర్ విలాస్, తాటిపల్లి

తగ్గుతున్న నీటిమట్టం.. ఎండుతున్న ఆయకట్టు

ఎండ తీవ్రతకు పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ వద్ద గల బొక్కివాగు ప్రాజెక్టులో క్రమంగా నీటిమట్టం తగ్గుతోంది. పొలాలకు సాగునీటిని అందించే కాలువకు నీరందడం లేదు. ఫలితంగా ఆయకట్టు కింద వరి సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి తడులు అందక పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– పెంచికల్‌పేట్







క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి కిందపడగా యువకుడి మృతి


బలరాం (ఫైల్)

నెన్నెల: బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బెల్లంపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బానోత్ బలరాం (38) మృతి చెందగా, నెన్నెల మండలం లంబాడీతండాకు చెందిన నవీన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బలరాం, నవీన్ లంబాడీతండాలో బంధువుల ఇంట్లో జరిగిన వరపూజలో పాల్గొన్నారు. పనిపై నెన్నెలకు వచ్చి తిరిగి లంబాడీ తండా వైపు వెళ్తుండగా కంబాల కుంట మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో బెల్లంపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో బలరాం మృతి చెందాడు. మెరుగైన చికిత్స కోసం నవీన్‌ను మంచిర్యాలకు తరలించారు.

'కొత్త చిగురు' ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయిని సుజాత రచించిన 'కొత్త చిగురు' తొలి పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ రచయితల వేదిక పూర్వరాష్ట్ర శాఖ అధ్యక్షుడు నాగభూషణం, ప్రముఖ నవలా రచయిత వినోద్, నీలాదేవి పుస్తక సమీక్ష చేశారు. కొన్నేళ్లుగా తన అనుభవాలు, ఆలోచనలపై సుమారు 72 కవితలతో వివిధ ప్రక్రియల్లో చేసిన రచనలను కొనియాడారు. ఈ సందర్భంగా సుజాతను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కవులు మలయశ్రీ, రాజిరెడ్డి, రాజేశం, శ్రీనాథ్‌గౌడ్, కవితాగానం అలరించింది. డాక్టర్ ఎంవీ పట్వర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వామన్‌రావు, అల్లాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్కా ఆడుతున్న ఇద్దరిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని నెహ్రూ కాలనీ వద్ద శుక్రవారం మట్కా ఆడుతున్నారనే సమాచారం మేరకు పట్టణ సీఐ శంకరయ్య ఆదేశాల మేరకు ఎస్సై అంజయ్య సిబ్బందితో కలిసి స్థావరంపై దాడి చేశారు. మట్కా ఆడుతున్న అదే కాలనీకి చెందిన మహ్మద్ అజ్గర్ హుస్సేన్, అఫ్జల్‌బేగ్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పాత బస్టాండ్ ఏరియా సింగరేణి తిలక్ స్టేడియం ఎదుట బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తిలక్ స్టేడియం నుంచి రోడ్డు పైకి వచ్చిన టేకుల బస్తీకి చెందిన గుండు సరోజను వేగంగా, అజాగ్రత్తగా బైక్ నడిపి రడగంబాల బస్తీకి చెందిన ప్రణయ్ అనే యువకుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రణయ్ బైక్ పైనుంచి డివైడర్‌పై పడి తీవ్రంగా గాయపడ్డాడు. సరోజ కాలుకు గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పర్యావరణంపై ప్రత్యేక దృష్టి

- మొక్కలు నాటిన యాజమాన్యం
- తనిఖీలు చేపట్టిన కేంద్ర బృందం
- నివేదిక సిద్ధం చేస్తున్న అధికారులు
- దీని ఆధారంగానే ఓసీలకు అనుమతి

తాండూర్: బొగ్గు నిక్షేపాలు అంతరించి, భూగర్భ భౌగోళిక పరిస్థితులు ప్రతికూలంగా మారి మూసివేతకు గురైన బొగ్గు గనుల పరిసరాల్లో పర్యావరణంపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. బొగ్గు వెలికితీత వరకే పరిమితం కాకుండా గనులు మూసివేసిన తర్వాత ఆ ప్రాంతంలో పర్యావరణానికి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టింది. దీంతో విస్తారంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కేంద్రం బృందం నాటిన మొక్కలను పరిశీలించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇటీవల బెల్లంపల్లి ఏరియాలో మూతపడిన పలు భూగర్భ గనుల వద్దకు వెళ్లి నాటిన మొక్కలు, చేపట్టిన సంరక్షణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మూసివేత గనుల పరిశీలన

బెల్లంపల్లి ఏరియాలో దాదాపు ఎనిమిది దశాబ్దాల క్రితం బొగ్గు గనుల ప్రస్థానం ప్రారంభమైంది. మార్గన్స్ పిట్ గనితో ప్రారంభమైన బొగ్గు తవ్వకాలు క్రమక్రమంగా విస్తరించాయి. బోయపల్లి, ఎంవీకే-1, ఎంవీకే-2, ఎంవీకే-3, ఎంవీకే-5, ఎంవీకే-6, గోలేటి-1, గోలేటి-2 భూగర్భ గనులు వరుసక్రమంగా విస్తరించాయి. ప్రస్తుతం ఆయా గనులన్నీ మూసివేతకు గురయ్యాయి. వీటి స్థానంలో అబ్బాపూర్, బీపీఏ ఎక్స్‌టెన్షన్-2 ఓపెన్ కాస్ట్ గనులు ఏర్పడ్డాయి. బొగ్గు గనులు మూసివేసిన తర్వాత ఉపరితలం, పరిసర ప్రాంతాల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టి తప్పనిసరిగా పర్యావరణాన్ని కాపాడాల్సి ఉంది. ఇందులో భాగంగా కంపెనీ యాజమాన్యం పర్యావరణ చర్యలు తీసుకుంటుందో.. లేదో.. ప్రత్యక్షంగా పరిశీలించడానికి కేంద్ర బృందం పర్యటించి వివరాలు నమోదు చేసుకుంది.


ఎంవీకే-5 గని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కేంద్ర కమిటీ సభ్యుడు (ఫైల్)


ఎంవీకే-2 ఇంక్లైన్ గని ప్రధాన ప్రాంతం


ఖాళీగా ఎంవీకే-1 ఇంక్లైన్ గని ప్రాంతం

పర్యావరణాన్ని కాపాడితేనే..

మూతబడ్డ భూగర్భ గనుల స్థానంలో కొత్తగా ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులను ప్రారంభించడానికి పర్యావరణానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఏరియాలో ఎంవీకే-1, ఎంవీకే-2, ఎంవీకే-3, ఎంవీకే-5, ఎంవీకే-6, గోలేటి-1, గోలేటి-2 భూగర్భ గనుల ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ గనుల ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం కొన్నేళ్ల క్రితం ప్రతిపాదనలు చేసింది. ప్రస్తుతం గోలేటి ఓపెన్ కాస్ట్ గనికి ప్రాథమిక దశలో కొన్ని అనుమతులు వచ్చాయి. ఈ ఏడాది చివరలో లేదా వచ్చే ఏడాదిలో ఎంవీకే ఓపెన్ కాస్ట్ గని ఏర్పాటుకు అనుమతులు వచ్చే అవకాశాలున్నట్లు సింగరేణి అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో కీలకమైన పర్యావరణ అనుమతులు లభించాల్సి ఉంటుంది. కొత్త ఓపెన్ కాస్ట్ గనులను ప్రతిపాదించిన అధికారులు అందుకు తగినట్లుగా మొక్కల పెంపకాన్ని చేపట్టి సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో భాగంగా కేంద్ర బృందం మూతబడ్డ గనుల వద్ద, పరిసరాల్లో సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను పరిశీలించి ఇచ్చే నివేదిక ప్రామాణికమవుతుంది. ఈ నివేదిక ఆధారంగానే కొత్తగా ఓపెన్ కాస్ట్ తవ్వకాలకు అనుమతులు రానున్నాయి.

సానుకూల పరిస్థితులు

మూసివేతకు గురైన బొగ్గు గనుల ప్రాంతంలో సింగరేణి యాజమాన్యం మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టింది. కొన్నేళ్ల క్రితం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. ఎంవీకే-1, 2, 3 గనుల వద్ద మినహా ఇతర గనుల వద్ద మొక్కల పెంపకం చేపట్టడంతో సానుకూల పరిస్థితులు ఏర్పడటానికి అవకాశాలున్నాయి. ఈ క్రమంలో ప్రతిపాదిత ఎంవీకే ఓపెన్ కాస్ట్ గనికి పర్యావరణ అనుమతులు ఏ మేరకు వస్తాయనేది కేంద్ర బృందం ఇచ్చే నివేదిక కీలకం కానుంది.

సీఎస్సార్ నిధులతో ఆస్పత్రులకు మిషన్లు


కాసిపేట పీహెచ్‌సీకి అందించిన మిషన్లు

కాసిపేట: మండలంలోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ దేవాపూర్ ఆధ్వర్యంలో సీఎస్సార్ నిధులతో ఆస్పత్రులకు పలు రకాల మిషన్లు కొనుగోలు చేసి అందించారు. శుక్రవారం దేవాపూర్‌లో కంపెనీ అధికారి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కంపెనీ అధ్యక్షుడు సత్యప్రసాద్‌శర్మ యూనిట్ హెడ్ మహేంద్రప్రతాప్‌జోషి ఆధ్వర్యంలో యాజమాన్యం సీఎస్సార్ నిధులతో కాసిపేట ప్రైమరీహెల్త్ సెంటర్‌కు అత్యవసరంగా కావాల్సిన ఈసీజీ మిషన్, కరెంట్ బ్యాకప్ బ్యాటరీలు, వీల్‌చైర్, ఆర్వో వాటర్‌ప్లాంట్, 10 బీపీ మిషన్లు అందించినట్లు తిరుపతి తెలిపారు. దేవాపూర్‌లోని ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్‌కు కావాల్సిన వాటర్‌స్టోరేజ్ ట్యాంకర్, పరుపులు, మెత్తలు, బెడ్‌షీట్లు, కూర్చునేందుకు స్టూళ్లను అందించినట్లు పేర్కొన్నారు. హైస్కూల్‌లో బోర్‌పంపు, వాటర్‌స్టోరేజ్ ట్యాంకులు అందించినట్లు తెలిపారు. దేవాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలకు కావాల్సిన బెంచీలు, డెస్కులు, ఆట వస్తువులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి అమ్మ అనాథ శరణాలయం వారికి సంవత్సరానికి సరిపడా రూ.2.80 లక్షల విలువైన తిండి సామగ్రి, వాటర్‌కూలర్, వాటర్‌ప్యూరీఫైడ్, 16 పరుపులు, ఆట వస్తువులు అందించినట్లు తెలిపారు. మంచిర్యాలలో రెడ్‌క్రాస్ సొసైటీ వారు నిర్వహిస్తున్న ఆశ్రమంలో అనాథ పిల్లలు, వృద్ధులకు ఉపయోగపడేలా వాటర్ కూలర్, డోమెట్రిక్ డ్రింకింగ్‌వాటర్, రూ.3 లక్షల విలువైన తిండి సామగ్రి అందించినట్లు పేర్కొన్నారు. కంపెనీ ఆధ్వర్యంలో సేవ చేసేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందని వివరించారు.

అటవీ పల్లెలు గజగజ

- జీభత్సం సృష్టిస్తున్న గజేంద్రుడు
- మూడ్రోజులు.. వంద కిలోమీటర్లు
- మూడు మండలాల్లో సంచారం
- ఇద్దరు రైతులను చంపిన ఏనుగు
- భయాందోళనలో అటవీ గ్రామాలు


గంగాపూర్ వ్యవసాయ భూముల్లోంచి వెళ్తున్న ఏనుగు

చింతలమానెపల్లి: మహారాష్ట్రలోని గడ్చిరోలి, తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్నాయి. జిల్లా సరిహద్దు ప్రాణహితనదికి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో గడ్చిరోలి అటవీప్రాంతం ఉంది. అక్కడి ఏనుగు జిల్లాలోకి వచ్చి బీభత్సం సృష్టిస్తోంది. ఇప్పటికే ఇద్దరు రైతులను చంపగా అటవీ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

3న ప్రాణహితనది దాటి..

ఈ నెల 3న ఉదయం మహారాష్ట్రలోని చౌడంపల్లి అటవీప్రాంతం నుంచి గజరాజు చింతలమానెపల్లి మండలం బూరెపెల్లి సమీపంలోని ప్రాణహిత నది దాటింది. ఏనుగు నదిలో ఉండగా కొందరు గ్రామస్తులు చూసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో 3న ఉదయం తెలంగాణలో ఏనుగు అడుగుపెట్టినట్లు అధికారులు ధ్రువీకరించారు. బుధ, గురు, శుక్రవారాల్లో సుమారు మూడు మండలాల్లో వంద కిలోమీటర్లు ప్రయాణించినట్లు నిర్ధారించారు. సాధారణంగా ఏనుగులు రోజుకు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయి. బుధవారం బూరెపల్లి సమీపంలోని ప్రాణహిత నది నుంచి సాయంత్రం వరకు చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిని దాటినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. గురువారం ఉదయం పెంచికల్‌పేట్ మండలం కొండెపల్లి వద్ద ఒక రైతుపై దాడి చేయగా ఏనుగు ఉనికి తెలిసింది. తిరిగి కొండెపల్లి వద్ద సాయంత్రం చీకటి పడ్డాక సుమారు 8గంటల సమయంలో ఏనుగు నలుగుపల్లి-కొండపల్లి అటవీప్రాంతంలో రహదారిపై బస్సుకు అడ్డంగా నడుచుకుంటూ వెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో పెంచికల్‌పేట్ మండలం కమ్మర్‌గాం పల్లెప్రకృతి వనం వద్ద కొందరు ఏనుగును గుర్తించి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. సాయంత్రం సమయంలో మురళిగూడ రహదారిపై ఏనుగు నడుచుకుంటూ వెళ్లడాన్ని గుర్తించారు.

వందకిలోమీటర్లు ప్రయాణించి..

జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో సుమారు వందకిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఏనుగును చూసిన సమయంలో ఎక్కడా విశ్రాంతి తీసుకున్నట్లు అది కనిపించకపోవడం గమనార్హం. మూడు మండలాల పరిధిలో ఏనుగు ప్రయాణించిన దూరం లెక్కిస్తే రహదారితో సుమారు 70 కిలోమీటర్ల దూరం ఉంటుంది. పలుచోట్ల ఏనుగు వెళ్లిన చోట తిరిగి వెనక్కి వచ్చింది. ఈలెక్కన సుమారు 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు అంచనా వేస్తున్నారు. సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో నీటి జాడను పసిగట్టే గుణం ఉన్న ఏనుగు చెరువులు, వాగులు, కాలువలున్న ప్రాంతాలను గుర్తించి ఆ దిశగా నడుచుకుంటూ వెళ్లినట్లు స్పష్టమవుతోంది. అడవుల్లోని చెట్ల బెరడు, ఆకులు, పండ్లు ఆహారంగా తీసుకునే ఏనుగుకు స్థానికంగా ఆహారం దొరికే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. తన గుంపు నుంచి ఏనుగు తప్పిపోయి ఉంటే వాటి జాడ కోసం ప్రయత్నిస్తుందని తెలిపారు. ఈక్రమంలో ఏనుగు తన గుంపును లేదా మరో గుంపును చేరేదాకా నడుచుకుంటూ వెళ్తుందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈమార్గంలో నడుచుకుంటూ వెళ్లడంతోనే పలు ఘటనలు చోటు చేసుకోవడం స్థానికంగా సంచలనంగా మారింది.

ఏళ్లకు కలిసి.. జ్ఞాపకాలు నెమరేసి..


అప్పటి గురువులతో 2005-06 పదో తరగతి విద్యార్థులు

నెన్నెల: ఆప్యాయత పలకరింపులు, గురువుల ఆశీర్వాదం కోసం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒక్కచోట కలిశారు. శుక్రవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా 20 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. దీంతో హైస్కూల్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఆటపాటలతో పూర్వవిద్యార్థులు అలరించారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు శ్రీరాంభట్ల రామ్మూర్తి, ఉపాధ్యాయులు రవికుమార్, గోపాలకిష్టయ్య, నర్సింహరెడ్డి, మధురాణి, ప్రమీల, హైస్కూల్ హెచ్‌ఎం ప్రకాశ్‌రావు, లోటస్ పాఠశాల కరస్పాండెంట్ మద్దెర్ల శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వవిద్యార్థులు కొండపల్లి వెంకటేశ్, తోట శ్రీనివాస్, దుర్గం తిరుపతి, ఎండీ సజ్జు, సద్దాం హుస్సేన్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న రాజిరెడ్డి

శ్రీరాంపూర్: యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి కోరారు. శుక్రవారం నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ డివిజన్ యూనియన్ కార్యాలయం వద్ద ఆయన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీజీకేఎస్‌కు హక్కులు సాధించిన ఘనత ఉందని, నేడు ప్రతిపక్ష సంఘంగా కార్మికుల హక్కుల సాధనకు పోరాడుతామని చెప్పారు. ఈ నెల 24న గోదావరిఖనిలో నిర్వహించనున్న యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, నాయకులు మాదాసు రాంమ్మూర్తి, పానుగంటి సత్తయ్య, తొంగల రమేశ్, పొగాకు రమేశ్, రాజునాయక్, పుప్పాల సత్యనారాయణ, సాదుల భాస్కర్, గొర్ల సంతోష్, పెండ్లి రవీందర్, రత్నాకర్‌రెడ్డి, పెట్టం వినోద్, వెంకట్‌రెడ్డి, వికాస్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

దండేపల్లి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగిన రెండు చోరీ కేసులను పోలీసుల గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శ్రీమాల్గాం మల్లన్న ఆలయంలో హుండీ డబ్బులతో పాటు వెండి ప్రతిమలు, గ్రామానికి చెందిన షేక్ హాజీ ట్రాలీ ఆటో బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం గూడెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ట్రాలీ ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య, పత్తి కనకరాజు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని పట్టుకుని విచారించగా, దండేపల్లిలో బుధవారం రాత్రి తామే చోరీలకు పాల్పడ్డట్లు ఒప్పుకొన్నారు. దీంతో వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారు ఎత్తుకెళ్లిన ట్రాలీ ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

భార్య కాపురానికి రావటం లేదని భర్త ఆత్మహత్య

రెబ్బెన: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని కొండపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన గుర్లె పోశం (27)కు కెరమెరికి చెందిన దీపతో గతేడాది వివాహమైంది. కొన్నినెలలు వీరి కాపురం సజావుగా సాగినా ఆ తర్వాత ఇద్దరి మధ్య చిన్నచిన్న గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఈ నెల 2న భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరగగా దీప పుట్టింటికి వెళ్లిపోయింది. తన భార్య కాపురానికి రాకుంటే చనిపోతానని పోశం తల్లి మెండుబాయితో అనేవాడు. దీంతో ఆమె సర్ది చెబుతూ వచ్చింది. అయినప్పటికీ పోశం మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌బియ్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బియ్యం వాహనం

బెల్లంపల్లి: రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్‌బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి మహారాష్ట్రకు తీసుకువెళ్లి విక్రయిస్తున్న సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. టాటా ఏస్‌లో 12 సంచుల్లో ఉన్న 5.4 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రేషన్‌బియ్యం దందా చేస్తున్న ద్వారకాకాసిపేటకు చెందిన అప్ప అక్షయ్‌కుమార్, రేచినిరోడ్‌కు చెందిన ఇందూరి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోగుల ప్రాణాలతో చెలగాటమాడిన ఒకరి అరెస్ట్

మంచిర్యాలక్రైం: ఓ ఆస్పత్రి యాజమాన్యంతో ఒప్పందం చేసుకుని రోగుల ప్రాణాలతో చెలగాటమాడిన అంబులెన్స్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్ శుక్రవారం విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. జైపూర్ మండలం నర్సింగపూర్ గ్రామానికి చెందిన సాగర్ తన సొంత అంబులెన్స్‌లో రోగులను వివిధ ఆస్పత్రులకు తరలిస్తూ జీవనం గడిపేవాడు. తాను గడపాలనుకున్న విలాసవంతమైన జీవితానికి డబ్బులు సరిపోకపోవడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి యాజమాన్యం నుంచి కమీషన్ తీసుకునేవాడు. ఈ క్రమంలో గత నెల 29న మ్యాదరి సింధూజ ప్రమాదంలో గాయపడగా ఆమె కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ డ్రైవర్ సాగర్‌ను సంప్రదించారు. దీంతో సాగర్ వారి నిర్ణయానికి వ్యతిరేకంగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ పరిస్థితి విషమించగా మళ్లీ తాను ఒప్పందం కుదుర్చుకున్న కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు, వసతులు లేకపోవడంతో సుమారు 40 నిమిషాల పాటు ఆస్పత్రిలో కమీషన్ కోసం కాలయాపన చేశాడు. తర్వాత కుటుంబ సభ్యుల ఒత్తిడితో మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు పరీక్షించి సింధూజకు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. అరగంట ముందుగా తీసుకువస్తే చికిత్స అందించి కాపాడేవారమని తెలిపారు. దీంతో బ్రెయిన్ డెడ్ అయిన సింధూజను మంచిర్యాల ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ ఈనెల ఒకటిన మృతి చెందింది. అంబులెన్స్ డ్రైవర్ ఆలస్యం చేయడంతోనే సింధూజ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. సాగర్‌ను విచారించగా నేరం ఒప్పుకోవడంతో శుక్రవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ, సీఐ తెలిపారు.

ప్రకటనల ఆదాయానికి గండి

- మంచిర్యాలలో ఇష్టారీతిన హోర్డింగులు
- రోడ్లు కబ్జా చేస్తూ ఏర్పాటు
- పట్టించుకోని మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తున్న హోర్డింగులతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది. అనుమతి తీసుకుంటే హోర్డింగ్ పరిమాణాన్ని బట్టి రూ.30వేలకు పైగా ప్రతినెలా చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల పాతమంచిర్యాల నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి వరకు, శ్రీనివాసగార్డెన్ వరకు రోడ్డుకు మరమ్మతులతోపాటు వెడల్పు చేశారు. ఈ రోడ్లపై ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అనుమతి తీసుకోకుండానే వ్యాపారులు ఇష్టారీతిన భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి ప్రకటనలు వేస్తున్నారు. 60శాతానికి పైగా హోర్డింగ్‌లు అనుమతి లేనివే ఉండగా.. మున్సిపాల్టీ ప్రతీ నెల రూ.లక్షల ఆదాయం కోల్పోతోంది. రోడ్ల పక్కనే ఇష్టారీతిగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు గాలి దుమారం సమయాల్లో వాహనదారులపై పడే ప్రమాదం లేకపోలేదు.

దృష్టి సారించని శాఖలు

జిల్లా కేంద్రం మంచిర్యాలకు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రతీరోజు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా హోర్డింగులను ఇష్టానుసారంగా ఏర్పాటు చేసి ప్రకటనలు, ఫ్లెక్సీలు, భారీ బ్యానర్లు పెడుతున్నారు. ఫ్లెక్సీలు చినిగిపోయి, గాలికి కొట్టుకుపోయి వాహనదారులకు అడ్డు పడే అవకాశాలున్నాయి. రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నా రోడ్లు, భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారుల డివైడర్ల మధ్యలో 8 టీపోల్స్ ఉండగా, ఒక్కో టీపోల్‌కు ఏటా రూ.2.30 లక్షలు మున్సిపాలిటీకి చెల్లించేలా టెండర్లు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు డివైడర్ల మధ్యలో నాటిన చెట్లకు ప్రకటనల ఏర్పాటు కోసం టెండర్లు నిర్వహిస్తుండగా, రోడ్ల పక్కన, ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేసే హోర్డింగులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 100 వరకు హోర్డింగులు ఉంటే, అందులో సగానికి పైగా అనుమతులు తీసుకోకుండా, కనీస ఫీజులు చెల్లించకుండానే నిర్వహిస్తున్నారు. ఇటీవల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు 13 హోర్డింగులకు అనుమతులు తీసుకోలేదని తొలగించారు. కానీ.. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన మిగతా వాటి తొలగింపులో తాత్సారం చేస్తున్నారు.


జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన హోర్డింగు

అనుమతులు లేని హోర్డింగులు తొలగిస్తాం

మున్సిపాలిటీ పరిధిలో అనుమతి తీసుకోకుండా ఏర్పాటు చేసిన 13 హోర్డింగులు గుర్తించి ఇటీవల తొలగించాం. మరికొందరు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అనుమతి తీసుకోకుండా, గతంలో అనుమతి తీసుకుని మున్సిపాలిటీకి ఫీజులు చెల్లించని వాటిపై చర్యలు తీసుకుంటాం. హోర్డింగుల ఏర్పాటు సమయంలో వ్యాపారులు ముందస్తుగా మున్సిపాలిటీలో అనుమతి తీసుకోవాలి. – శ్యామ్, టీపీఎస్, మంచిర్యాల మున్సిపాలిటీ